


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

85

(4' ఆగస్ట్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"ఓటు కావాలన్నా...**

**సీటు కావాలన్నా...**

**వాటముగ బస్సు రూటు కావాలన్నా..**

**పర్మిట్లు కావాలన్నా**

**ప్రమోషన్లు కావాలన్నా..**

**చింతించకో ప్రాణనాథా! "**

ఈ పాట తరుచు వినపడుతూవుంటుంది. అంతకు ముందు ఎలా వున్నా జూన్, జూలై నెలలనుంచీ పాట శ్రద్ధగా వినాలనిపించింది. వివరాలు తెలుసుకోవాలనే ఆసక్తి కలిగింది.

ఇది కలెక్టరు జానకి చిత్రంలో నాగభూషణం చెప్పిన కుచేలోపాఖ్యానం హరికథలోనిదట. కుచేలుడు నిస్సహాయుడై ఉన్న తరుణంలో భార్య ప్రోత్సాహపరుస్తూ శ్రీకృష్ణుని వద్దకు వెడితే పైన చెప్పిన పనులు అన్నీ సులభంగా అవుతాయని చెపుతుందట.

***ఎందరో కుచేలుళ్ళు... కొందరు కృష్ణుళ్ళు***

మరి ఈ రోజుల్లో కుచేలుళ్ళ సంఖ్య అతిగా పెరిగింది. వారితోపాటే, వరదాన హస్తులూ పదాన్యులూ అయిన కృష్ణయ్యలు కూడా పెరిగారు.

ఒక్క కాలేజీ సీటు కావాలంటే దాతలు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులై పోతున్నారు. కొన్నికొన్ని పేరున్న కాలేజీలలో ఆఫీసు గదులు వైకుంఠధామాలైపోతున్నాయి. గేటు దగ్గరనుంచి "సీటు. సీటు... ఒక్క సీటు. వరదాతా! సకలగుణోపేత, విద్యాజ్యోతి" అంటూ భక్తులు ప్రస్తుతిస్తూ లోపలకు ప్రవేశించడం జరిగింది.

కానీ అదిష్టానవర్గాల దర్శనం కాక పడికాపులు పడడం నిస్సహాయులై తిరిగిరావడం కూడా మాములు దృశ్యమైపోయింది. మాటలా మరి.. అంత తేలిగ్గా ముక్తి సంపాదించడం.

మొదట చెప్పిన పాటలో శ్రీకృష్ణుణ్ణి అడగమంటుంది సీటు కుచేలుడి భార్య. ఇక్కడ ఎందరు కృష్ణయ్యలనైనా అభ్యర్థించవలసి వస్తుంది సీటు కోసం. కృష్ణులు అటుకులతో అంత తేలిగ్గా వశమవుతారా! ఎన్ని తిప్పలు పడాలి? ఈ కృష్ణయ్యలతో సంభాషణ చూడండి ఎలా ఉంటుందో.

కృష్ణయ్య: ఎవరు నువ్వు ఎందుకలా ప్రొద్దుటినుంచీ వాకిట్లో తపస్సు చేస్తున్నావు?

అభ్యర్థి: చిత్తం తమ దర్శనభాగ్యం కోసం. నేడు సుదినం.

కృష్ణ: ఏమిటి నీ కోరిక. నీ కులగోత్రమ్ములేవి? ఏ వర్గమునకు చెందినవాడవు? ఎవరు పంపగా వచ్చితివి?

అభ్యర్థి: అవసరము పంపగా వచ్చితిని. అట్టి వారి కులగోత్రములన్నియూ ఒక్కటే. తమరు...

కృష్ణ: అసాధ్యునివలెనున్నావు. చెప్పుము కోరిక.

***రాకరాక ఒక్కడు కాలేజీకి వచ్చాడు.***

అభ్యర్థి: రాకరాక ఒక్క కుమారుడు జూనియర్ కాలేజీకి వచ్చినాడు. అన్నలు ఎంతో ప్రయత్నించి అంత దూరము రాలేకపోయినారు. వీడు ఆచారము తప్పించి పైకి వచ్చినాడు. వీనికి మీరొక్క సీటు సిఫార్సు చేయవలసినదిగా వినమ్రుడనై వేడుచున్నాను.

శ్రీకృష్ణ: నేనా! సీటా! ఎంతమందికి ఇప్పించగలను? వేరు మార్గము చూసుకొనుము.

అభ్యర్థి: అంతమాట వినలేను. మీరుతప్ప నాకెవరు గలరు? అసలైన విద్యాదాతలు మీరే. సీటు ఇప్పించిన వారినే కలకాలం తలచుకొందుము - కొలుచుకొందుము. ప్రభుత్వమువారు విద్యార్థి ప్యాసుకాడని ఇచ్చిన అర్హతా పత్రము. సిఫార్సువలననే బర్హిబర్హముగా భాసించుచున్నది. లేనిచో ఆ పత్రమును చూచువారెవరు? పిలిచి క్లాసు లోపల కూర్చుండుమనువారెవ్వరు?

శ్రీకృష్ణ: నాకు సాధ్యం కాదు. చాలామందికి చెప్పాను.

అభ్యర్థి: మీరలా అంటే నేనెవరితో చెప్పుకోను.

శ్రీకృష్ణ: బ్రహ్మదేవుడితో

***సరస్వతీ నిలయాలు .. .సిఫార్సుల వలయాలు***

అభ్యర్థి: ఆయన మాట ఏ కాలేజీవారు వింటారు స్వామీ? కళాశాలలు సరస్వతీ నిలయాలేగానీ సీట్లు సిఫార్సుల వలయాలు. తమరు ఫోను తీసి ఒక్కమాట చాలు. రెండేళ్ళదాకా మీకు మళ్ళా శ్రమ ఇవ్వను. కరుణించాలి.

శ్రీకృష్ణుడు: నువ్వు నాకు పరమభక్తుడవలె ఉన్నావు. నిన్ను చూస్తే జాలివేస్తుంది. కానీ నేను నిరుడే నా అభ్యర్థుల పేర్లు ఇచ్చేశాను. వారిలో ఎవరైనా తప్పితే మీ అబ్బాయికి చాన్సు ఉండేది. అందరూ పాసయ్యారు. మీవాడికి పై సంవత్సరం తప్పక ఇప్పిస్తాను. ఈ సంవత్సరం రెస్టు తీసుకోమను. టైపు నేర్చుకోమను. విద్యార్థులకు మధ్య మధ్య ఖాళీరావడం ఆరోగ్యరీత్యా చాలా మంచిది. వెళ్ళిరా. నాకిక తీరికలేదు.

అభ్యర్థి: అంతేనంటారా! నా గతి అంతేనంటారా! సీటు దొరకదంటారా?

శ్రీకృష్ణుడు: ఏం చేస్తావు? ఈ ఏడు తప్పాడనుకో.. వెళ్ళిరా.

ఇలా అభ్యర్థించి, నిస్పృహతో తిరిగి వచ్చిన వారనేకమంది ఉంటారు. పిల్లల తల్లితండ్రులతో వారికి గల తొందర ఇతరులకు కూడా ఉంటుందనుకుని పొరబడుతూ ఉంటారు. సీటు ఇంద్రాధిపత్యంగా మారింది.

***సీటు దొరక్కపోతే - సిగరెట్టుకొట్టు పెట్టరా***

ఇంటర్ సీటుకోసం ఎంతగానో తిరిగి తిరిగి వేసారిపోయిన ఒక తండ్రి కొడుకుతో వ్యాపారం ఏదైనా చేసుకొమ్మని బోధించాడు. వారి సంభాషణ -

"చివరికి సిగరెట్టు కొట్టు పెట్టుకోవచ్చురా! రోజుకో అయిదారు రూపాయలు మిగులుతాయి. కాలేజీ కోర్సు ముగిసేనాటికి నువ్వో ఇల్లు కడతావు. బిడియం దేనికిరా! వ్యాపారం చేసేవాళ్లొక్కరేరా బిక్కముఖాలు లేకుండా కనపడేది. కావాలంటే సాయంత్రంపూట ఎప్పుడైనా సినిమాకు వెడుదువుగాని. ఆ కాసేపు కొట్లోనే కూర్చుంటాలేరా! నా మాట వినరా.." అని తండ్రి.

"వినను నాన్నా! నా భావి జీవితమంతా నాశనమైపోతుంది. నేను న్యూక్లియర్ ఫిజిక్స్‌లో చేరాలని ఎన్నో పరిశోధనలు చెయ్యాలనీ ఫారిన్ వెళ్ళాలని కలలు కంటుంటే సిగరెట్టు కొట్టు పెట్టమంటారేమిటి? ఇది హాస్యమా! " అని కుమారుడు అడిగాడు.

"హాస్యమేమిట్రా?అన్ని మార్కులొచ్చి ఫస్టుక్లాసు జాబితాలో పడి సీటు కోసం ఇలా తంటాలు పడటం చూడలేక అన్నానురా! మొదటి సీటులోనే ప్రవేశం దొరికింది. ఇన్ని ప్రహరీలెలా దాటతావు ఎందుకొచ్చిన బాధ బ్రతుకుతెరువు చూచుకోవడం మంచిదిరా!" అని తండ్రి.

ఆ తండ్రి ఎంత విసుగుపడుతున్నాడో ఆ కుమారుడిలో అంత రోషం ప్రజ్వరిల్లుతోంది - పై చదువులకు ఎగబ్రాకాలని. వారి వేదన వేరువేరుగా చెప్పుకోవడమేగాని - పరిష్కరించుకోవడమెలా!

***ఒకడు మైసూర్ - ఒకడు భోపాల్ - ఒకడు విజయవాడ***

ఒక గృహస్థు కాలేజీ చదువులకు వచ్చిన ముగ్గురు కుమారులు ఒక్క ఊళ్ళో ఉండి చదువుకుని, ఆశపడి విజయవాడలో ఇల్లు తీసుకుని కాపురం పెట్టాడు. తను ఉద్యోగరీత్యా దూరంగా ఉన్నాడు. ముగ్గురు కుమారులూ ఫస్టుక్లాసులో వచ్చినవాళ్ళే. వాళ్ళకు సీట్ల కరువేం ఉంటుందనుకున్నాడు.

కానీ జరిగిన విషయం ఒక్క కుర్రవాడికి తప్ప తక్కిన వారిద్దరికీ ప్రవేశం దొరకలేదు. వారిని చూచి ఇనపగేట్లు గభాలున మూసివేశారు. ఏం చేస్తారు? ఒక కుర్రవాడు భోపాల్ వెళ్ళాడు. ఒకడు మైసూరు వెళ్ళబోతున్నాడు. భారతదేశం అంతా ఒకటే అనే సూత్రం వారికి అన్వయమయ్యే పరిస్థితి ఏర్పడింది.

తలో రాష్ట్రంలో.. తండ్రి పాపం ఉద్యోగరీత్యా ఒక ఊళ్ళో. ఊళ్ళో కాలేజీలున్నాయంటే కొందరికే ఉపయోగపడుతున్నాయి. కొన్ని కాలేజీలలో అడగడం మాత్రం మార్కులడుగుతారు. తరువాత వారి యిష్టం. రిమార్కు చేసేందుకు వీలులేదు.

ఒక్క హైదరాబాద్‌లో మాత్రం సర్కారు విద్యార్థులకు సీటు దొరకలేదంటే ఎలాగో అలా సీటు చూపిస్తామన్నారు ప్రభుత్వంవారు. వాళ్ళకు వాళ్ళు కోరిన చోట మాత్రం కాదు అదైనా కొంతనయం.

ప్రతి ఊళ్ళో విద్యార్థులు వలసపోకుండా 'కావలసిన సీట్లు పెంచడం' అనే చర్యకూడా ప్రభుత్వం తీసుకుంటే ఎంతో మేలుగా ఉంటుంది. ఒక్క సీటు కోసం ఇళ్ళూ వాకిళ్ళూ వదిలిపోవడం ఎంత కష్టం. ఇది ఏటేటా చాలామందికి పట్టుకునే దురదృష్టం.

Post your comments